ప్రజాశక్తి
మంగళవారం 20 మే 2025
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

నేటి నుంచి ఉక్కు సమ్మె

◆ కాంట్రాక్టు కార్మికుల పోరాటం తీవ్రం ◆ మద్దతుగా నిలుస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులు చారిత్రాత్మక పోరాటానికి దిగుతున్నారు. మంగళవారం నుంచి వారు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. వారికి పర్మినెంట్ కార్మికులు మద్దతు తెలుపుతున్నారు. వారూ మంగళవారం నాటి సమ్మెలో పాల్గొంటున్నారు. గడచిన నాలుగున్నరేళ్లుగా కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులను ఉక్కు యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. తొలగింపులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఈ క్రమంలో ఉక్కు యాజమాన్యంపై వారంతా తిరుగుబాటుకు సన్నద్ధమయ్యారు. గడచిన కొద్ది రోజుల కాలంలో ప్లాంట్‌లో నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా స్టీల్ యాజమాన్యం తొలగించింది. 2024 ఎన్నికల్లో గెలిస్తే మొదటి అజెండా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడమేనంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టిడిపి విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఉక్కు పరిశ్రమ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక వైఖరిపై గెలిచిన తరువాత కనీస స్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలు కార్మికులు, ఉద్యోగులు, ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. వీరిద్దరి గెలుపులో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కుటుంబాల ఓట్లు అత్యంత కీలకంగా ఉన్నాయన్న విషయాన్ని వారే స్వయంగా అంగీకరించిన సంగతి తెలిసిందే. కష్టకాలంలో కార్మికుల తరపున నిలబడకుండా వెన్నుపోటు పొడవడంపై ఈ ప్రాంత ప్రజల్లో చర్చ జరుగుతోంది.

ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలన్న కుట్రలో భాగంగానే నాలుగున్నర సంవత్సరాలుగా బ్లాస్ట్ ఫర్నేస్‌లను పనిచేయనివ్వకుండా యాజమాన్యానికి డైరెక్షన్ ఇస్తూ పర్మినెంట్ కార్మికులకు విఆర్ఎస్ ఇచ్చేసి 1213 మంది ఉద్యోగులను ఇంటికి పంపే చర్యలను చేపట్టింది. అటు కాంట్రాక్టు కార్మికులు, ఇటు పర్మినెంట్ ఉద్యోగులపై కక్ష సాధింపులకు యాజమాన్యం పాల్పడుతోంది. కొద్దికాల వ్యవధిలోనే 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించింది. అందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ప్రతిరోజూ కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. ఉత్పత్తికి ఆటంకం లేకుండా పోరాడుతున్నారు. ఇంకా అనేక మందిని తొలగించేందుకు యాజమాన్యం చూస్తోంది. ఇంత జరుగుతున్నా ఇప్పటివరకూ తొలగించిన వారి గురించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన కూటమి నేతలు కనీస మిగతా 2లో..

మాట్లాడుతున్న తపన్‌సేన్, చిత్రంలో సిహెచ్.నర్సింగరావు, మంత్రి రాజశేఖర్ తదితరులు

ఉక్కు ఉద్యమానికి దేశ వ్యాప్త మద్దతు

సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ప్రజాశక్తి - ఉక్కునగరం

విశాఖ ఉక్కు కార్మికుల ఉద్యమం ఒంటరి కాదని, దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలన్నీ మద్దతు ఇస్తున్నాయని సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20 నుంచి జరిగే సమ్మెతో చావో రేవో తేల్చుకుందామని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేయాలంటూ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ స్మృత్యంజలి కూడలి వద్ద సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకోవడం కార్మికుల జీవన్మరణ సమస్యగా మారిందని అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాటం దేశాభివృద్ధిని ప్రతిబింబిస్తోందని, కనుకే ప్లాంట్‌ను అంబానీ, అదానీలకు కట్టబెట్టాలన్న పాలకుల నిర్ణయాన్ని కూడా నిలువరిస్తోందని తెలిపారు. పోరాటాన్ని అణిచివేయడానికి కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసేలా కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో ఐక్య పోరాటాలతో ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఐఎన్‌టియుసి జాతీయ కార్యవర్గ సభ్యులు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ, యాజమాన్య నిర్బంధాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగమే సమ్మె అని పేర్కొన్నారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆది నారాయణ మిగతా 2లో..

రెండు వేర్వేరు ప్రాంతాల్లో దారుణ హత్యలు
▶ వార్త 6లో..

సుందరయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడు
▶ వార్త 8లో..

చేపట్టని ఉపాధి హామీ పనులు
▶ వార్త 6లో..

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సముద్ర జలాల్లో 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లు

మంత్రి అచ్చెన్నాయుడు వార్త 2లో..

డిప్యూటీ మేయర్ ఎన్నికపై

కూటమి పార్టీల్లో కుదరని సఖ్యత

◆ అసంతృప్తితో సమావేశానికి హాజరుకాని జనసేన, టిడిపి కార్పొరేటర్లు

◆ కోరం సరిపోకపోవడంతో ఎన్నిక నేటికి వాయిదా ◆ అభ్యర్థిగా దల్లి గోవిందరెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

తీవ్ర ఉత్కంఠ నడుమ సోమవారం జరగాల్సిన జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించిన ప్రత్యేక సమావేశం మంగళవారానికి వాయిదా పడింది. కూటమి పార్టీల్లో సఖ్యత కుదరకపోవడంతో ఈ పరిణామం ఎదురైంది. సమావేశం నిర్వహించడానికి కావలసిన కోరం 56 మంది సభ్యులు కాగా ఎక్స్ అఫీషియల్ సభ్యులతో కలుపుకొని 54 మంది మాత్రమే హాజరు కావడంతో డిప్యూటీ మేయర్ ఎన్నికలకు సంబంధించిన ప్రత్యేక సమావేశాన్ని ఎన్నికల అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మంగళవారానికి వాయిదా వేశారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియల్ సభ్యులు కలుపుకుని జనసేన నుంచి 16 మంది, టిడిపి నుంచి 34 మంది, సిపిఎం నుంచి ఒకరు, సిపిఐ నుంచి ఒకరు, బిజెపి నుంచి ఇద్దరు హాజరయ్యారు. విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, టిడిపి కార్పొరేటర్లు గొలగాని మంగవేణి, మొల్లి హేమలత, గంధం శ్రీను సహా పలువురు గైర్హాజరయ్యారు. వైసిపి కార్పొరేటర్లు ఇప్పటికే ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించారు

జనసేన ఎమ్మెల్యేలతో దల్లి గోవిందరెడ్డి

సోమవారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన సమావేశంలో జనసేన, టిడిపి, మిగతా 2లో..

ఉక్కు కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ఆపాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ నిర్బంధాన్ని వెంటనే ఆపాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును, కార్మికులను అష్టదిగ్బంధనం చేస్తోందని తెలిపారు. సంస్థ ఉత్పత్తిలో దశాబ్దాల తరబడి కీలక విధులు నిర్వహిస్తున్న మూడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అమానుషంగా తొలగించిందన్నారు. మరో 2600 మందిని తొలగించడానికి సిద్ధపడిందని తెలిపారు. అర్ధాంతరంగా తొలగిస్తుంటే వారి కుటుంబాలు ఏం కావాలి ? అని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను పూర్తిగా కాలరాస్తున్నారని, ఇది అన్యాయమని అడిగిన కార్మికులను, నాయకులను ఇది కేంద్ర ప్రభుత్వ ఆదేశమంటూ నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని తెలిపారు. వార్నింగ్ లెటర్లు ఇస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులకు, యూనియన్ నాయకులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని, సస్పెన్షన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎనిమిది నెలలుగా పూర్తి జీతాలు ఇవ్వడం లేదన్నారు. విఆర్ఎస్ పేరుతో కార్మికులను వేల సంఖ్యలో తగ్గిస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడుతామంటూనే సంస్థను, ఉత్పత్తి కారకులైన కార్మికులను అష్టదిగ్బంధనం చేస్తున్నారని చెప్పారు. గత్యంతరం లేక తమ ఉపాధిని, కుటుంబాలను కాపాడుకోవడం కోసం విశాఖ ఉక్కు కార్మికులు సమ్మెకు సిద్ధపడాల్సి వచ్చిందన్నారు. ఈ స్థితిలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సంస్థను, కార్మికులను రక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కానీ దీనికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల మీద, వారి ఉద్యమం మీద నిర్బంధం ప్రయోగించడం కార్మికులను మరింత అగాధంలోకి నెట్టడమే అవుతుందని జగ్గునాయుడు అన్నారు. స్టీల్ ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డిపార్ట్మెంట్ లోపల స్థానిక పోలీసులను నియమించి కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గేటు మీటింగులకు అనుమతి ఇవ్వడం లేదని, అరెస్టులకు పూనుకుంటున్నారని తెలిపారు. ఇది కార్మికుల ప్రజాతంత్ర హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు, కార్మికులకు హాని చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి పూర్తి వత్తాసు పలకడమే అవుతుందన్నారు. గత ప్రభుత్వ నిర్బంధాన్నే కూటమి ప్రభుత్వమూ అనుసరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని పోలీసు నిర్బంధాన్ని నిలిపివేయాలన్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

నేటి నుంచి ఉక్కు సమ్మె

స్థాయిలో స్పందించడం లేదు. బాధ్యతగా ఉక్కు సమస్యను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఈ నేపథ్యంలో ఉక్కు పోరాటానికి మద్దతుగా సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ తపన్‌సేన్ సోమవారం నాటికే విశాఖకు చేరుకున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొని ఉక్కు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.

ఉక్కు ఉద్యమానికి దేశ వ్యాప్త మద్దతు

మాట్లాడుతూ యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య విధానాలను స్వస్తి పలకాలన్నారు. సభాధ్యక్షులు, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతి రెడ్డి, ఎఐటియుసి అధ్యక్షులు కెఎస్ఎన్.రావు, సిపిఐ జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, భాస్కర్, అప్పారావు మాట్లాడుతూ సమ్మెను జయప్రదం చేయాలని కార్మికవర్గాన్ని కోరారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, తౌడన్న, పివి.రమణమూర్తి, బిఎన్.రాజు, దొమ్మేటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు స్మృత్యంజలి కూడలిలో కార్యక్రమాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రభుత్వ నిర్బంధంపై కార్మికుల మండిపాటు

ఈ నెల 20 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో జరిగే సమ్మెను అడ్డుకునే క్రమంలో ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద కార్మిక సంఘాలు సమ్మె సన్నాహ సభ జరుపుకునేందుకు అనుమతి లేదంటూ సోమవారం సాయంత్రం పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. కార్మికులు ప్రతిఘటించి సభ నిర్వహించారు. తపన్ సేన్‌తో సహా పలువురు కార్మిక నేతలు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ నుంచే కార్మికులనుద్దేశించి మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అండగా ఉంటామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వమే ఇలా వ్యవహరిస్తుండటంపై కార్మికులు మండిపడ్డారు. కార్మిక శాఖ మార్గదర్శకాలను పాటిస్తూనే సమ్మె నోటీసు ఇచ్చి కార్మికులు సమ్మెకు వెళ్తుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సమ్మెను సహించేది లేదంటూ ఉక్కు ఉన్నతాధికారులు నేరుగా బెదిరింపులకు దిగడం చర్చనీయాంశమైంది.

డిప్యూటీ మేయర్ ఎన్నికపై కూటమి పార్టీల్లో కుదరని సఖ్యత

బిజెపి కార్పొరేటర్లు సమావేశమయ్యారు ఈ సమావేశంలో భాగంగా అధిష్టానం నుంచి వచ్చిన షీల్డ్ కవర్‌ను ఓపెన్ చేసి డిప్యూటీ మేయర్ స్థానానికి దల్లి గోవిందరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేసినట్టు ప్రకటించిన వెంటనే అప్పటికే డిప్యూటీ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకున్న గంధం శ్రీను, మొల్లి హేమలత వంటి టిడిపి సభ్యులు అసంతృప్తి చెంది అక్కడి నుండి వెళ్లిపోయారు. జివిఎంసి డిప్యూటీ మేయర్ స్థానానికి అభ్యర్థిగా అధిష్టానం ఆదేశాల మేరకు జనసేన పార్టీకి చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద రెడ్డిని ఎంపిక చేస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ బి ఫారం అందజేశారు. అతడు జనసేన తరపున 2021 మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 5000 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన విషయం విదితమేజ ఇదిలా ఉంటే జనసేన పార్టీ తరపున డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 34వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పేరు వినిపించినప్పటికీ ఆమె వైసిపి నుండి జనసేనలోకి వచ్చిన కారణంగా జనసేన, టిడిపి సభ్యులు వ్యతిరేకించారని తెలుస్తోంది. అంతేకాకుండా ఎంతోకాలంగా జనసేనకు నమ్మకంగా సేవ చేస్తున్న కందుల నాగరాజును అభ్యర్థిగా ప్రకటించకపోవడంతో అతడు జివిఎంసికి వచ్చినప్పటికీ కౌన్సిల్‌కు హాజరు కాకుండా బయటే ఉండిపోయారు. అనంతరం ఉదయం 11 గంటలకు ప్రాంభమైన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం కోరం లేనందున వాయిదా వేయడమైనదని ఎన్నికల అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు.

కూటమిలో లుకలుకలు : బొత్స

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక సాక్షిగా కూటమి పార్టీల మధ్య ఉన్న లుకలుకలు బయటపడ్డాయని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం బీచ్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక కోరం లేకపోవడం వల్ల వాయిదా పడింది. కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్ల మధ్య తేడాలు ఉండటం వల్ల కోరంనకు సరిపడే కార్పొరేటర్లు ఈ ఎన్నికకు హాజరు కాలేదు. కూటమి పార్టీలకు అధికారం, దానిని అడ్డం పెట్టుకుని దోచుకోవడమే ముఖ్యం. ప్రజలకు మంచి పాలన అందించాలనే ఆలోచనే లేదు' అని ఆయన అన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు వస్తే వాటిని అడ్డం పెట్టుకుని దోచుకోవాలనేదే వారి ఉద్దేశమని పేర్కొన్నారు. కోరంనకు సరిపడా సంఖ్యాబలం ఉండి కూడా డిప్యూటీ మేయర్ ఎన్నికను సజావుగా ఎందుకు చేయించుకోలేకపోయారన్నారు.

సముద్ర జలాల్లో 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొదటి విడతగా 22 కత్రిమ ఆవాసాల యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు పశు సంవర్ధకశాఖ, వ్యవసాయ, సహకార, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని పెదజాలారిపేట ఎండాడ సముద్రంలో సోమవారం ఆర్టిఫీషియల్ రీఫ్స్ (కత్రిమ ఆవాసాలు) విడుదలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రంలో ఈ కత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేయడం వలన మత్స్యసంపద వద్ధి చెంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లా సముద్రజలాల్లో మొదటి విడతగా 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు, భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర జిల్లాల తీరప్రాంత సముద్ర జలాల్లో కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోని మొకనైజ్డ్ బోట్లకు ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పిఎంఎంఎస్‌వై) కింద 634 ట్రాన్స్‌పాండర్స్ 100 శాతం సబ్సిడీపై అందజేసినట్లు తెలియజేస్తూ ట్రాన్స్‌పాండర్స్ వాడకం వలన సముద్రంలో బోటు యొక్క స్థానాన్ని తెలుసుకొనడం, తుఫానులు ఇతర ప్రకతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించేటప్పుడు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో మత్స్యకారులకు జిపిఎస్, ఎకోసౌండర్, బోట్లు, ఇంజన్స్, వలలు, తాళ్ళు వంటి పరికరాలు సబ్సిడీ పై సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో డీజిల్ ఆయిల్ సబ్సిడీ, ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్, క్రెడిల్స్ ఏర్పాటుకై పోర్ట్ ఛైర్మన్‌తో మాట్లాడి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెకనైజ్డ్ బోటు సంఘ అధ్యక్షులు సమస్యలను మంత్రిల దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ కె బీచ్ ఎదురుగా మత్స్యశాఖ ద్వారా పిఎంఎంఎస్‌వై పథకం కింద ఏర్పాటు చేసిన కేజ్‌కల్చర్, సివీడ్ కల్చర్ యూనిట్ సందర్శించి మత్స్యకార యువత, మహిళలకు ఉపాధి, జీవనోపాధి మెరుగుపరుచుటకు ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్, రామశంకర్ నాయక్, విశాఖపట్నం మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, పి.లక్ష్మణరావు, సిఎమ్ఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, స్థానిక కార్పొరేటర్ మర బోట్ల సంఘ అధ్యక్షులు ఎమ్.లక్ష్మణరావు, పి.సి.అప్పారావు, నర్సింగరావు, బాలాజీ, ఎండాడ, పెదజాలారిపేట, కొత్తజాలారిపేట మత్స్యకార నాయకులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

కేజ్ కల్చర్ ప్రారంభం

ప్రధానమంత్రి మత్స్యసంపదయోజన పథకంలో భాగంగా జాలారి ఎండాడ వద్ద చేపపిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన కత్రిమ ఆవాసాల కేంద్రాన్ని, ఫిషింగ్ హార్బర్‌జీరో జెట్టీ వద్ద సముద్రపు పాచి, చేపపిల్లల పెంపకానికి సంబంధించిన కేజ్‌కల్చర్‌ను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ప్రారంభించారు. అనంతరం జెట్టీ నెం.2 వద్ద జరిగిన సభలో మత్స్యకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: తెలంగాణ రాష్ట్రం భూపాలపల్లిజిల్లా, కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు జరగనున్నాయని, కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత నదులు, భూగర్భ సరస్వతి నదితో కలిసే పవిత్ర సంగమం వద్ద ప్రత్యేకంగా నిర్వహించబడే పుష్కరాలకు వెళ్లే యాత్రికుల కోసం విశాఖపట్నం ఎపిఎస్‌ఆర్టిసి ఈ నెల 23న మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరుతుందని ఆర్టిసి రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. విశాఖపట్నం కాంప్లెక్స్ నుంచి బయలుదేరి కాలేశ్వరం వెళ్లి తిరుగు ప్రయాణంలో భద్రాచలం దేవాలయంలో రాములవారి దర్శించుకుని రావడానికి సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. రెండువైపులా కలిపి ప్రయాణ చార్జీలు ఒక మనిషికి రూ.2700 మాత్రమే అన్నారు. టికెట్స్ కావలసినవారు ఆన్‌లైన్‌లో https://www.apsrtconline.in వెబ్ సైట్‌లో విశాఖపట్నం సరస్వతి పుష్కరాలు రూట్ సెలెక్ట్ చేసి సీట్లు రిజర్వ్ చేసుకోవాలన్నారు. రిజర్వేషన్ కౌంటర్‌లో కూడా టికెట్స్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. 34మంది కలసి వస్తే వారికి అనుకూలమైన రోజున బస్సులను ఏర్పాటు చేస్తామని ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ, యాదాద్రి యాత్రలు కూడా చేర్చి ఈ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తామని యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 8309265666, 9959225602, 9052227083, 9959225594, 91001 09731 నంబర్లతో సంప్రదించాలన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు మహానాడు గొప్ప వేదిక అని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. ఉత్తర నియోజకవర్గం టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మే 27,28,29 తేదీల్లో నిర్వహించే మహానాడుకి ముందు శాసనసభ నియోజకవర్గాల వారీగా, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా నిర్వహించి కార్యకర్తల ద్వారా సమస్యలను తెలుసుకుని తీర్మానం చేసి పార్టీ అధిష్టానానికి పంపించడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్రపార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్, కార్యదర్శి లొడగల కష్ణ, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు వెల్లంకి భరత్, జిల్లా నాయకులు పైలా ముత్యాలనాయుడు, గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

భానుప్రియకు సత్కారం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్, పోర్టులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వశాఖ, సాగర్ మెయిన్ సమ్మాన్, ది మారిటైమ్ యూనియన్ ఆఫ్ ఇండియా, నేషనల్ మారిటైమ్‌డే సెలబ్రేషన్స్ కమిటి సంయుక్తంగా ముంబై శాంటాక్రూజ్ (తూర్పు)లోని తాజ్ హోటల్‌లో ఆదివారం అంతర్జాతీయ మారిటైమ్ మహిళల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎస్ఎల్ డిప్యుటి జనరల్ మేనేజర్ (డిజైన్ అండ్ బిడిడి) ఎం.భానుప్రియను సత్కరించారు. హైడ్రోజన్ శక్తితో నడిచే టగ్‌ల రూపకల్పనలో గ్రీన్ షిప్‌బిల్డింగ్ టెక్నాలజీను అభివృద్ధి చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించినందుకు ఆమెను ఈ గౌరవం లభించింది.

అధిష్టానం దృష్టికి కార్యకర్తల సమస్యలు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ నేతలు, సీనియర్ క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ జాతీయ నాయకురాలు కిల్లి కృపారాణి హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని సింకా గ్రాండ్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నాయకులు,కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాజీవ్ గృహకల్పలో సమస్యల తిష్ట

అసౌకర్యాల నడుమ రాజీవ్ గృహకల్ప సముదాయం

◆ తప్పని తాగు నీటి వెతలు

◆ వీధి దీపాలు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి నేరెళ్లవలస కాలనీలో 2004 - 09 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఒక బ్లాక్‌లో 12 ఇళ్లు చొప్పున 22 బ్లాక్‌లతో 528 ఇళ్లు నిర్మించారు. ఇప్పటికి 45 కుటుంబాలు మాత్రమే ఇక్కడ నివాసముంటున్నాయి. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఇక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. సొంత ఇళ్లు ఉన్నప్పటికీ భీమిలి, ఇతర ప్రాంతాల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అద్దెలు చెల్లించి ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. స్థానికుల వినతులు, విజ్ఞప్తుల మేరకు పరిమితమైన కొన్ని బ్లాక్‌లలో ఉన్న ఇళ్లకు మాత్రమే ఇటీవల తాగు నీటి సదుపాయం కల్పించారు. ఒక బ్లాక్‌లో ఉన్న 12 ఇళ్లకు తాగు నీరు అందించేందుకు వీలుగా ఒక్కో బ్లాక్ పై 500 లీటర్ల సామర్థ్యం గల సిన్టెక్స్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. సరఫరా అవుతున్న తాగు నీరు ఎటూ చాలడం లేదని స్థానికులు అంటున్నారు.

చెయ్యెత్తులో ఉన్న విద్యుత్ సెక్షన్ బాక్స్

ట్యాంకర్ ద్వారా తాగు నీరు..

9, 11, 16, 17, 18 బ్లాకులతో పాటు అనేక బ్లాక్‌ల్లో ఉన్న వారికి జివిఎంసి ఆధ్వర్యాన ట్యాంకర్ ద్వారా తాగు నీరు సరఫరా అవుతుంది. ట్యాంకర్ వస్తే తాగు నీటిని నిల్వ ఉంచుకునేందుకు ప్లాస్టిక్ డ్రమ్ములను ఆరుబయట ఉంచుతుంటామని అక్కడున్న ఖాళీ డ్రమ్ములను స్థానికులు చూపించారు. బ్లాక్‌ల్లో ఉన్న కుటుంబాలకు సింటక్స్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి తాగు నీరు ఇవ్వాలని కోరుతున్నారు.

వీధి దీపాలు లేక ఇక్కట్లు...

బ్లాక్‌కు బ్లాక్‌కు మధ్య ఉన్న సిమెంట్ రోడ్డుకు ఓ వైపు ఉన్న విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు కొత్తవి వెయ్యాలని స్థానికులు కోరుతున్నారు. నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. బ్లాక్‌కు బ్లాక్‌కు మధ్య ఏపుగా పెరిగిన తుప్పలు, కాల్వల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాల్లో పారిశుధ్య సమస్య ఉందని చెబుతున్నారు. ఇటీవల కొన్ని బ్లాక్‌ల వద్ద పెరిగిన తుప్పలను పాక్షికంగా తొలగించారు. పూర్తి స్థాయిలో తుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెయ్యెత్తు ఎత్తున ఏర్పాటు చేసిన సెక్షన్ బాక్స్‌కు పైకప్పు లేక పోవడంతో అటుగా వెళ్లే ఒకటి రెండు ఆవులు, గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయని స్థానికుడు శ్రీనివాసరావు తెలిపారు. చిన్న పిల్లలు కూడా అటు వెళ్లి ఆడుతున్నారని, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం వేస్తుందని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు.

తాగు నీరు కల్పించాలి

బ్లాక్‌కు తాగు నీటి సదుపాయం కల్పించాలి. రెండు రోజులుగా ట్యాంకర్ ద్వారా తాగు నీరు రాలేదు. దూరంగా ఉన్న బోరింగ్ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. బ్లాక్‌లపై సిన్టెక్స్ ట్యాంక్‌లు ఏర్పాటుచేయాలి.

ఎన్.విజయకుమారి
11వ బ్లాక్, గ్రౌండ్‌ఫ్లోర్

వీధి దీపాలు వేయాలి

బ్లాక్ ల వద్ద నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో పాము, పుట్ర వస్తున్నాయి. పిల్లలు భయ పడుతున్నారు.

ఎన్.సత్యనారాయణ

కాల్వల్లో చెత్తను తొలగించాలి

కాల్వల్లో చెత్తను తొలగించాలి. చెత్త, చెదారం, ఖాళీ సీసాలు ఎక్కడికక్కడే చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. నీరు వెళ్లేందుకు వీలు లేకుండా కాల్వల్లో చెత్త పోగుబడి ఉంది.



జోగ వీర్రాజు
గ్రౌండ్ ఫ్లోర్

నేరాలు ఘోరాలు

స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో విశాఖ డెయిరీ బల్క్ కూలర్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సోమవారం ఉదయం 5 గంటల సమయంలో ఆనందపురం మండలం బోని గ్రామం నుంచి విజయనగరం జిల్లా అలమండ వెళ్తున్న టాటా ఏసీ వాహనం ఢీకొట్టింది. అలమండలోని సంతకు పశువులను తీసుకెళ్తూ ఈ వాహనం బలంగా ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. పశువులకు, డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

విశాఖ కేంద్ర కారాగారానికి బాంబు పేలుళ్ల కుట్రదారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్ర పన్నుతున్నారన్న అభియోగంపై విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్‌తో పాటు సికింద్రాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌ను వేర్వేరుగా విశాఖ కేంద్రకారాగారానికి తరలించారు. బాంబు పేళుళ్లకు పాల్పడాలనుకున్న సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్, విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్‌లను విజయనగరం పోలీసులు ఆరెస్టు చేసి విజయనగరంలో కోర్టులో ప్రవేశపెట్టారు. వీరికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో అక్కడే సబ్ జైల్లో ఉంచారు. వీరి భద్రత దృష్ట్యా సమీర్‌ను ఆదివారం మధ్యాహ్నమే విశాఖ కేంద్రకారాగారానికి తరలించారు. సిరాజ్‌ను సోమవారం ఉదయం కారాగారానికి తరలించారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తెలుగు, హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 1031 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 817 మంది హాజరయ్యారని, 214 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఓపెన్ స్కూలు పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగినట్టు తెలిపారు. 9 కేంద్రాల్లో హిందీ పరీక్ష జరగగా 34 మంది విద్యార్థులకు 29 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఓపెన్ స్కూలు ఇంటర్ పరీక్షలు ఐదు కేంద్రాల్లో ఇంగ్లీషు పరీక్షకు 119 మంది విద్యార్థులకు గాను 98 మంది హాజరయ్యారని తెలిపారు. తాను రెండు పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృంధాలు 29 కేంద్రాలను సందర్శించినట్టు వివరించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదని తెలిపారు.

శ్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి- ఆనందపురం : గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం శ్మశానం వాటిక చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను గ్రామ యువత, కూటమి నాయకులు తొలగించారు. పిచ్చి మొక్కలు పెరిగి దహన సంస్కరణలకు ఇబ్బందిగా ఉండడంతో గ్రామ యువత స్వచ్ఛందంగా సేవా కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సుంకర శివ ఆధ్వర్యాన పిచ్చి మొక్కల తొలగించి జెసిబితో పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు సుంకరి శివ, దొంతల శ్రీరామ్, కొలగాని రమణ, తాడివాడ శివకృష్ణ, ఇల్లపు మహేష్, తాడివాడ రామకృష్ణ, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు

పిజిఆర్ఎస్‌కు 5 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడుకు 5 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 1, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4 అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు తెలిపారు

యాతవాని చెరువులో 'ఉపాధి' పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని ఆర్‌వి.పురం గ్రామంలో ఉన్న యాతవాని చెరువులో ఉపాధి హామీ పనులు చేపట్టాలని పద్మనాభం తహశీల్దార్‌కు సోమవారం గ్రామానికి చెందిన సర్పంచ్, ఎంపిటిసి, నాయకులు వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 73-2లోని ఉన్న చెరువులో పనులు చేపట్టాలని కోరారు.

ఆర్ఐ లేక సర్టిఫికెట్లు ఆలస్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేకపోవడంతో సర్టిఫికెట్లు జారీలో ఆలస్యమవుతున్నాయి. ఆర్ఐగా ఉన్న ప్రేమలత డిప్యుటేషన్‌పై ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లడంతో ఆరు రోజులుగా పలు పనులకు ఆటంకం కలుగుతోంది. సర్క్యూట్ హౌస్ ప్రొటోకాల్ విషయాల్లోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రాల నిమిత్తం ఆర్ఐ సంతకం కచ్చితంగా ఉండాల్సిన తరుణంలో ఆర్ఐ లేక, సర్టిఫికెట్లు రాక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆర్ఐ నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పేద బాలునికి సికిల్ సెల్ ఎనీమియా

సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం బిసి కాలనీలో నివసిస్తున్న పేద కుటుంబానికి చెందిన బోరాడి శ్రావణ్ (7) సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుని తండ్రి పాపారాయుడు వంట మాస్టర్‌గా, తల్లి తవిటమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. బాలుడు శ్రావణ్ శరీరంలో రక్తం అకస్మాతుగా తగ్గి నాలుగు గ్రాముల స్థాయికి పడిపోతోంది. ఆ సమయంలో విపరీతమైన జ్వరం, నీరసం వచ్చి కదలలేక పోతున్నాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. బోన్‌మేరో చికిత్స చేయించాలని వైద్యులు చెప్పారని, అందుకు లక్షల్లో ఖర్చు అవుతుందన్నారని, దీంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. బాలుడు నీరసించి పోతుండటంతో అపోలో ఆసుపత్రిలో చికిత్స చేయించగా సుమారు రూ.50 వేలు ఖర్చయిందని, రేడియేషన్ పరీక్ష అనంతరం చికిత్స చేయాల్సి ఉంటుందని తెలిపారు. కొంతమేర ఆరోగ్యశ్రీ వర్తించినా సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దరఖాస్తు చేసి మూడేళ్లయినా పింఛన్ కూడా రావడం లేదని తెలిపారు. దాతలెవరైనా సాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇటీవల గోపాలపట్నం ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ సొసైటీ వారు స్పందించి రూ.10 వేలు బాలుని వైద్యానికి అందించారని తెలిపారు. సాయం చేయదలచిన వారు 7036327442, 809653743 నెంబర్లను సంప్రదిం చాలని బాలుని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలుని తల్లిదండ్రులకు సాయం అందిస్తున్న దాతలు

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : బక్కన్నపాలెం ఇండోర్ సబ్ స్టేషన్ పరిధి 11కెవి శంభువానిపాలెం ఫీడర్‌పై మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జోన్ 3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని బక్కన్నపాలెం, ఎన్‌టిఆర్.కాలనీ, లచ్చిరాజు లే-అవుట్, రైల్వే లే-అవుట్, పోలీస్ బెటాలియన్ తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురం: ఆనందపురం సబ్‌స్టేషన్ 11 కెవి బాకూరుపాలెం ఫీడర్, ఐటిబిపి ఫీడర్ నిర్వహణ పనుల కోసం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ అప్పలనాయుడు తెలిపారు. ఈ కారణంగా ఎల్‌వి.పాలెం, సీతంపాలెం, జగ్గరాజుపాలెం, పందలపాక, బాకురుపాలెం, ఇచ్ఛాపురం, గొంపువానిపాలెం, చిన్నయ్యపాలెం, రామునాయనిపేట, రేగనిగూడెం, ముకుందపురం కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ర్యాంకు సాధించిన ప్రసాద్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఈసెట్ ఫలితాల్లో 'విశాఖ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పెందుర్తి : ఇటీవల విడుదలైన ఈసెట్ ఫలితాల్లో నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో చదివిన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. డిప్లమో మెకానికల్ విభాగం విద్యార్థి సిహెచ్.ప్రసాద్ స్టేట్ 19వ ర్యాంకు సాధించాడు. మంచి ర్యాంకు సాధించిన విద్యార్థిని కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్ అభినందించారు. సుమారు 15 మంది విద్యార్థులు వందలోపు ర్యాంకు సాధించారని కళాశాల ఛైర్మన్ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి-లీగల్ : నాలుగేళ్ల పాపను లైంగిక వేధింపులకు గురిచేసిన అభియోగం రుజువైనందున ఒక వ్యక్తికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని చిన్నపిల్లల లైంగిక వేధింపుల నిరోధక కేసుల విచారణ న్యాయస్థానం న్యాయమూర్తి పి.మంగాకుమారి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో బాధితుల తరుపున వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి... కొత్త గాజువాక మున్సిపల్ ఆఫీస్ దగ్గరలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముంటున్న నిందితుడు తేమూరి శివ ఇంటికి బాధిత బాలిక 2017 మే 14వ తేదీ సాయంకాలం 6 గంటలకు రోజు మాదిరిగా ఆటకు వెళ్లింది. ఎంతకీ రాకపోయేసరికి బాలిక తల్లి నిందితుడు శివ ఇంటికి వెళ్లి పిలవగా బాలిక అర్ధనగ్నంగా ఏడుస్తూ వచ్చింది. తల్లి ఆమెను ప్రశ్నించగా నిందితుడు తన చేతి వేళ్లతో ప్రయివేటు పార్టులను తాకినట్లు చెప్పింది. దీనిపై బాలిక తల్లి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సిఐ ఇమాన్యుయేలురాజు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పై విధంగా శిక్షిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా రూ.25 వేలను నిందితుడి నుంచి వసూలు చేసి బాధిత బాలికకు పరిహారం కింద చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని, డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రజ్ఞ, కార్యదర్శి స్వాతి మాట్లాడుతూ, సమ్మెలో ఉన్న తాము మూడు వారాలకు పైగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి తమ రోదన వినిపించకపోవడం శోచనీయం అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ కటింగ్ రెండేళ్లుగా నిలిపేశారని, ఇది సరికాదని, పాత పద్ధతిలో పిఎఫ్ కట్ చేయాలని కోరారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సిహెచ్‌ఒలను మినహాయింపునివ్వాలని, హెచ్‌ఐర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్ గ్రేషియో, పితృత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సునీత, కల్పన, జస్వంత్, మణి, స్వాతి, అరుణ, శాంతి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో కూర్చున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అర్జీలు పునరావృతం కాకూడదు

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలన్నారు.

అధికారులతో సమీక్ష

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌నకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సిఎంఒ కార్యాలయం, డిప్యూటీ సిఎంఒ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంలో జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో స్వయంగా అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీ పునరావృతం అయితే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు మండల కార్యాలయాలలో ప్రతి సోమవారం నిర్వహించబడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంతో పాటుగా అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, అర్జీల నమోదు, నమోదైన అర్జీలకు సంబంధించిన స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కు నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

వచ్చే సోమవారం పిజిఆర్ఎస్ సందర్భంగా అధికారుల సమక్షంలోనే అర్జీదారులతో ఫోన్ ద్వారా మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. అర్జీ పరిష్కారానికి అధికారులు స్వయంగా ఫోన్ చేసి తీసుకున్న చర్యల గురించి అర్జీదారులతో చర్చిస్తానని చెప్పారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 225 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 91 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 18, జివిఎంసికి సంబంధించి 51 ఉన్నాయి. ఇతర విభాగాలకు సంబంధించి 65 వినతులు వచ్చాయి.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు వైసిపి మద్దతు

మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు మంగళవారం నుంచి చేస్తున్న సమ్మెకు వైసిపి మద్దతు ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. సోమవారం గాజువాకలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రధానమంత్రి మోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను విధుల నుండి తొలగిస్తున్నారని, శాశ్వత ఉద్యోగులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపిస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కృషిచేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుపై ఉందన్నారు. ఈ సమావేశంలో గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, పరదేశి, ధర్మాల శ్రీనివాసరావు, శిరట్ల వాసు, శంకరనారాయణ, డివి.రమణ, బొడ్డ గోవింద, పూర్ణ, కోమటి శ్రీను, చిత్రాడ రమణ పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలి

సిపిఐ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం, పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా మంజూరు చేయాలని, సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ సిపిఐ ఆరిలోవ, మధురవాడ శాఖల ఆధ్వర్యాన సోమవారం చినగదిలి రూరల్ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహ్మాన్ మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కళ నెరవేర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల ఇళ్ల నిర్మాణం అంటూ భారీగా ప్రకటన చేసి అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెలో మూడు సెంట్లు స్థలం ఇచ్చి రూ.4 లక్షలతో ఇంటి నిర్మాణాలు చేపడతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అరకొరగానే అమలుచేస్తుందని విమర్శించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు జి.రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎండి.భేగం, ఎ.దేముడమ్మ, కె.లక్ష్మణరావు, సిహెచ్.కాసుబాబు, కె.సందీప్ పాల్గొన్నారు.

గాజువాక : అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన పెద గంట్యాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వనజాక్షి మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినా పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. సిపిఐ నాయకులు కె.అచ్యుత రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జి.ఆనంద్, పి.దుర్గారావు, కె.పోతన్న, యెల్లేటి శ్రీనివాస్, పల్లేటి పోలయ్య, పిల్లా పద్మ, ఈశ్వరరావు, శివ, టిడ్‌కో గృహ లబ్ధిదారులు అప్పలరాజు, రమణి పాల్గొన్నారు.

సీతమ్మధార : పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాత్రపల్లి చంద్రశేఖర్, నెయ్యల నాగభూషణరావు, పడాల గోవింద్, ఆడారు ఆదినారాయణ, ఎన్.మధురెడ్డి, చంటి, హరి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన మహారాణి పేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మథరావు, సిఎన్.క్షేత్రపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరిలోవలో పేదలకు ఇళ్లు, పట్టాలు మంజూరు చేయాలని ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

ఘన చరిత్ర నుండి హీన స్థితికి..

- గోవాడ సుగర్స్ మనుగడ ప్రశ్నార్థకం
- పాలకవర్గాల్లేక జవాబుదారీతనం కరువు
- ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఆర్థిక ఇబ్బందులు
- నమ్మించి మోసం చేసిన ఎంపీ సిఎం రమేష్

ప్రజాశక్తి-చోడవరం

ఒకప్పుడు చోడవరం చక్కెర కర్మాగారం అంటే ఈ ప్రాంతంలో గొప్పగా చెప్పుకునే పరిశ్రమ. మాడుగుల, చోడవరం నియోజకవర్గం రైతులకు ఎంతో భరోసాగా ఉండేది. ఫ్యాక్టరీలో సభ్యుడిగా ఉండే రైతుకు ఎనలేని గౌరవంతో పాటు ఆర్థికంగా అండగా ఉండేది. ఈ ఫ్యాక్టరీలో షేర్‌కు ఎంతో విలువ ఉండేదంటే సభ్య రైతులు తమ కష్ట సుఖాలప్పుడు, పెళ్లిళ్లకు షేర్ అమ్ముకుని ఆర్థిక అవసరాలు తీర్చుకునే వారు. అంటే ఫ్యాక్టరీ షేర్‌కు అంతటి విలువ ఉండేది. అలాంటి ఏడెనిమిది సంవత్సరాల నుండి ఫ్యాక్టరీ దీనవస్థకు చేరుకుంది.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చరిత్ర ఎంతో ఘనమైనది. ఈ ఫ్యాక్టరీ గతంలో న్యూ ఢిల్లీకి చెందిన ది నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ నుండి అత్యధిక చెరుకు క్రషింగ్ అవార్డు, ఎస్ఐఎస్ఎస్‌టిఎ నుండి ఉత్తమ ఆర్థిక క్రమశిక్షణ అవార్డు, జోన్‌లో అత్యధిక చెరుకు క్రషింగ్, రాష్ట్రంలోనే సహకార చక్కెర కర్మాగారాల్లో అత్యధిక చక్కెర రికవరీ వంటి అవార్డులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అందుకుంది. 2015-16 క్రషింగ్ సీజన్‌లో 5,50,000 టన్నులు క్రషింగ్ జరిపింది. అలాంటిది ఈ ఏడాది లక్ష టన్నులకు దిగజారిందంటే ఫ్యాక్టరీ ఏ స్థితికి చేరిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చెరుకు గిట్టుబాటు కాక, ఫ్యాక్టరీ నుండి, ప్రభుత్వం నుండి భరోసా లేక ఏడాదికేడాది రైతులు చెరుకు పంటకు దూరమవుతూ వస్తున్నారు. 24,835 మంది సభ్య రైతులు గల సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ప్రస్తుతం చెరుకు పండించే వారి సంఖ్య 4000కు చేరుకుంది. గతేడాది ఉడుపు, కార్శీ కలిపి 5000 ఎకరాల్లో సాగు జరిగింది. ప్రస్తుతం సాగు 2000 ఎకరాలకు దిగింది. ఈ ఏడాది ఒక లక్ష 8 టన్నులు క్రషింగ్ జరిపి సుమారు 50,000 క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేసింది. రికవరీ ఐదు శాతంగా నమోదైంది. గతంలో 9.5 శాతం రికవరీ వచ్చేది. రికవరీ శాతం గణనీయంగా పడిపోవడంతో సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు చెల్లించలేని స్థితికి ఫ్యాక్టరీ చేరుకుంది. ఇప్పటివరకు రూ.4 కోట్లు బకాయిలు రైతులకు చెల్లించారు. ఇంకా రూ.24.40 కోట్లు రైతులకు, మరో రూ.7 కోట్లు కార్మికులకు చెల్లించవలసి ఉంది. ప్రస్తుతం ఫ్యాక్టరీ ఒడిదుడుకులు నుండి గట్టెక్కాలంటే సుమారు రూ.35 కోట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం ఫ్యాక్టరీలో పంచదార నిల్వలు, మొలాసిస్ రూ.20 కోట్లు వరకు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది పూర్తిగా రైతులకు బకాయిలు చెల్లించాలంటే రూ.15 కోట్లు అవసరమవుతాయి. దీనిని ప్రభుత్వం వేగవంతంగా సమకూర్చవలసి ఉంది. వచ్చే ఏడాది క్రషింగుకు సన్నద్ధం కావాలంటే సుమారు రూ.20 కోట్లు అవసరమవుతాయి.

ప్రోత్సాహకాలు, రాయితీలకు ఎసరు

రైతులకు అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు గత రెండేళ్ల నుండి ఇవ్వడం లేదు. ఎరువుల మీద రాయితీలు, వడ్డీ లేని రుణంతో విత్తనం సరఫరా, కార్మిక, రైతుల పిల్లలకు ప్రోత్సాహకాలు, పశువులు చనిపోతే ఇన్సూరెన్స్, డివిడెంట్లు, అదనపు ప్రోత్సాహకాలు పూర్తిగా నిలిపివేశారు. ప్రమాదవశాత్తు మరణం, సహజ మరణం పొందిన రైతులకు ఇవ్వవలసిన ఇన్సూరెన్స్ బకాయి కోటి 30 లక్షల రూపాయల వరకు ఉంది.

పాలకవర్గాలు లేక జవాబుదారీ తనం కరువు

సుమరు పదేళ్లగా ఫ్యాక్టరీకి పాలకవర్గాలు లేవు. పాలకవర్గాలు ఉండేటప్పుడు జవాబుదారీగా ఉండేవారు. కాని పాలకవర్గాలను నియమించకుండా పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించిన తరువాత, ఫ్యాక్టరీలపై వారి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సహకార ఫ్యాక్టరీల మనుగడ పూర్తిగా పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లయింది.

ఆర్థిక సాయం అందించని కూటమి ప్రభుత్వం

2019లో వైసిపి ప్రభుత్వం వచ్చే నాటికి ఫ్యాక్టరీ అప్పు రూ.140 కోట్లు ఉండేది. వైసిపి ప్రభుత్వ కాలంలో వివిధ రూపాల్లో రూ.89 కోట్లు ఫ్యాక్టరీకి అందించింది. దీంతో ఆ అప్పు నేడు రూ.50 కోట్లుకు తగ్గింది. ఈ కాలంలో అందించిన ఆర్థిక సహకారంతో ఫ్యాక్టరీ కష్టనష్టాలను ఎదుర్కొని ఇప్పటివరకు క్రషింగు జరుపుతూ వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎటువంటి ఆర్థిక సాయం ఫ్యాక్టరీకి అందించకపోవడంతో ఇప్పుడు పూర్తిగా చతికల పడే పరిస్థితి దాపురించింది.

నమ్మించి మోసగించిన ఎంపీ సిఎం.రమేష్

వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు అధికారులపైనా, ప్రజాప్రతినిధుల పైనా విమర్శలు గుప్పించిన టిడిపి, జనసేన నాయకులు ప్రస్తుతం ఫ్యాక్టరీ అనేసరికి ముఖం చాటేయడం పరిపాటిగా మారింది. 2024 ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన సీఎం.రమేష్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని, అనుబంధ యూనిట్లు పెట్టి ఫ్యాక్టరీని, రైతులను ఆదుకుంటామని హామీలు గుప్పించాడు. పారిశ్రామికవేత్త అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైతే మన ప్రాంతానికి పరిశ్రమలు రావడానికి అవకాశం ఉంటుందని టిడిపి కూటమి నేతలు ఊదరగొట్టి మరీ ఏ మాత్రం బలం లేని బిజెపి అభ్యర్థిని గెలిపించారు. కాని సిఎం.రమేష్ ఏడాది కాలంలో ఫ్యాక్టరీ మనుగడకు ఎటువంటి కృషి చేయకుండా రైతులను మోసం చేశారు.

ప్రజల సమస్యల వింటున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

పబ్లిక్ గ్రీవెన్స్‌కు విశేష స్పందన

- పలు సమస్యలపై 370 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కలెక్టరేట్లో సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై 370 అర్జీలు అందజేశారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 197 దరఖాస్తులు ఉన్నాయి. కలెక్టర్ విజయకృష్ణన్, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, ఎస్‌డిసి సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుల సత్వర పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీచేసారు. అనంతరం పెండింగ్ అర్జీలపై శాఖల వారీగా జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. పెండింగు అర్జీలన్నింటిని వెంటనే పరిష్కరించాలని, వచ్చే వారానికి అర్జీలు పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రాంకీ యాజమాన్యం వ్యర్థ రసాయనిక జలాలను అక్రమంగా మొల్లోడు గెడ్డలోకి విడుదల చేయడంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా వ్యర్థ రసాయనిక జలాలను నిబంధనలకు విరుద్ధంగా మొల్లోడు గెడ్డలోకి విడుదల చేసిందని పేర్కొన్నారు.

డిసిసిబిలో అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలి

విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి ఆరోపణపై విచారణ చేపట్టాలని జనసేన నాయకులు ఎర్రంశెట్టి పాపారావు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డిసిసిబిలో గత ప్రభుత్వంలో 300 కోట్లు అవినీతి జరిగిందని తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో40 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 40 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు, చీటింగ్ తదితర అంశాలు ఉన్నాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. సమస్యను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తక్షణమే విచారణ చేపట్టి చట్టపరమైన పరిష్కారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిపిసిలో పోలీసు వెరిఫికేషన్ పేరుతో

వేధింపులపై కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పరవాడ : ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ కార్మికులను పోలీసు వెరిఫికేషన్ పేరుతో వేధించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌టిపిసి మెయిన్ గేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌టిపిసి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను పోలీస్ నుండి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధన పెట్టడం సరికాదని, దానిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిపిసి యాజమాన్యం ఒక ప్రైవేట్ మార్వాడి కంపెనీ కంటే ఘోరంగా కార్మికులను వేధింపులు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టిపిసిలో ఇప్పటివరకు వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధించే వారిని, ఇది కొనసాగుతూ ఉండగానే క్యారెక్టర్ సర్టిఫికెట్ పోలీస్ స్టేషన్ నుండి తీసుకురావాలని నిబంధన పెట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్మికులకు ఇప్పుడు పోలీస్ క్యారెక్టర్ సర్టిఫికెట్ ఇవ్వాలని నిబంధన పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ చర్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పిపి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి గోవిందరాజు, రమణ, శ్రీను, రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు, సిఐటియు నేత గనిశెట్టి

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టరు విజయకృష్ణన్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సోమవారం మండల స్థాయి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల సర్వే, సంపద తయారీ కేంద్రాలు, డ్వామా, హౌసింగు, సూర్యఘర్, పంచాయతీ రాజ్ పనులు తదితర అంశాలపై వీడియా కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, పూర్తిచేసిన వివరాలు, వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను కలెక్టరు ఆదేశించారు. క్లోరినేషను చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. గ్రామవార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హెూమ్, మన మిత్ర సేవలు, చిన్నపిల్లలకు ఆధార్ నమోదు, ఈకెవైసీ వంటి సర్వేలను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు పనిదినాలు పూర్తి చేయాలన్నారు. ఫారం ఫాండ్స్, పశువుల నీటితొట్టెలు వెంటనే పూర్తిచేయాలని కోరారు. జిల్లాలో మంజురైన 13,687 ఇంటి నిర్మాణాలకుగాను ఇప్పటి వరకు 7482 పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. అదనపు సహాయం అందిస్తున్న 3,115 ఇండ్లకుగాను 665 మాత్రమే నిర్మాణాలు పూర్తిచేసారని, మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే నిర్మాణాలు పూర్తిచేసుకొనేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి డిప్యూటీ సి.ఇ.ఒ. కె.రాజుకుమార్, జిల్లా పంచాయతీ అదికారి ఆర్. శిరీషారాణి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటరు ఇ. నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఇఇ కె.వి.నాయుడు, గ్రామీణ నీటి సరఫరా జిల్లా ఇంజనీరింగ్ అధికారి ఎస్.ఎ.ఎస్. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యబాబును కలిసిన విజయ్

ప్రజాశక్తి- మునగపాక : టిడిపి మండల నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పెంటకోట విజయ్ అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఎటువంటి గ్రూపులు, గొడవలు లేకుండా అందరినీ కలుపుకుపోవాలని ఈ సందర్భంగా తాతయ్యబాబు సూచించారు. ఐకమత్యంతో పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, అధికార ప్రతినిధి ఆడారి జానకి, కార్య నిర్వాహక కార్యదర్శి కడియం అనురాధ, కార్యదర్శి రేబాక మాలతి, తెలుగు యువత అధికార ప్రతినిధి కాండ్రేగుల శంకర్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ నాయుడు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడు విజయ్‌ను సత్కరిస్తున్న తాతయ్యబాబు

శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి మండల అధ్యక్షులు చిన్న

మాజీ ఎంపిపికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పరవాడ : టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు సునీత దంపతుల వివాహ వార్షికోత్సవం సోమవారం వాడ చీపురుపల్లిలో వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న మాసవరపు అప్పలనాయుడు సునీత దంపతులను సాలువాతో సత్కరించి, వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం వై జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బుచ్చయ్యపేట ఎస్సై ఏ శ్రీనివాసరావుకు రాజాం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆకులు నాగేశ్వరరావు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలు సైతం ముమ్మరంగా జరుగుతున్నాయని, వాటి ఆచూకీ కనిపెట్టాలంటే సీసీ కెమెరాలు తప్పనిసరి పేర్కొన్నారు.

ఎసిసి ఆధ్వర్యాన సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-చోడవరం : పిల్లల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కోసం అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ (ఎసిసి) సౌజన్యంతో చోడవరంలో వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఎసిసి కన్వీనర్ బి.ఉమామహేశ్వరావు ప్రారంభించారు. మొదటి రోజు సుడుకో, పజిల్, క్యూబ్ అంశాలతో పాటు వివిధ రకాల మైండ్ గేమ్స్‌ని ఆడించారు. క్యాంపు నిర్వాహకులుగా కె గోవింద మాస్టారు వ్యవహరించారు. మొదటి రోజు రిసోర్స్ పర్సన్‌గా ఎం వెంకట్రావు, సుడుకో మాస్టర్ పెద్ద సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని చోడవరం లోని పిల్లలందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ, ఈడబ్ల్యుఎస్ సంయుక్త సహకారంతో అనకాపల్లి మండలం చింత నిప్పుల అగ్రహారం, అనకాపల్లి పట్టణం కోట్నివీధి సచివాలయం భవనంలో ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన అనంతరం వీరికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఎన్ అగ్రహారం, అనకాపల్లి కోట్ని వీధి కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రకృతి వ్యవసాయం ఇన్చార్జి సిహెచ్. సత్యవతి అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025-26లో చేయబోయే సర్వేపై ఛాంపియన్ రైతులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ట్రైనింగు 30 రకాల విత్తనాలు ఎకరాకి 12 కేజీలు చొప్పున ఒక కిట్టు రూ.1250 ఇస్తున్నట్లుచెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోను దేవుడమ్మ గంగునాయుడు, సెక్రటరీ సిహెచ్ త్రిమూర్తులు, విఎఎ పి.హేమలత, ఎస్ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.లక్ష్మి, సిహెచ్. సత్యవతి,ఎల్. శాంతి పాల్గొన్నారు.

పేర్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలో ఉన్న అన్ని గ్రామాల రైతులు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా పెట్టుబడి సహాయం పొందేందుకు రైతు సేవ కేంద్రాల్లో పేర్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ సోమవారంఒ ప్రకటనలో తెలిపారు. రైతు సేవ కేంద్రానికి ఆధార్, పాస్ బుక్, 1బి పట్టుకొని వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవడం ద్వారా తప్పులు ఉంటే, సరి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వెరిఫికేషన్ అయిన తదుపరి ప్రతి రైతుకు ఈ-కేవైసీ చేయడం జరుగుతుందని తెలిపారు.

రెండు వేర్వేరు ప్రాంతాల్లో దారుణ హత్యలు

★ తీసుకున్న అప్ప అడిగినందుకు ముత్యాలమ్మపాలెంలో నరికి చంపిన వైనం
★ నిందితుడిని ఉరితీయాలని మృతుని భార్య, కుటుంబీకులు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన
★ కశింకోట మండలం ఉగ్గినపాలెంలో బావను హతమార్చిన సంఘటన

అనకాపల్లి జిల్లా పరవాడ, కశింకోట మండలాల్లో ఆదివారం రాత్రి రెండు దారుణహత్యలు చోటుచేసుకున్నాయి.

పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని భార్య పిల్లలు, కుటుంబ సభ్యులు

మైలపల్లి బంగార్రాజు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో తీసుకున్న అప్పును తీర్చాలని అడిగినందుకు ఆదివారం రాత్రి మైలపల్లి బంగార్రాజు (33) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన కె.కామేష్ అలియాస్ కామరాజు కత్తితో నరికి అతి దారుణంగా హత్య చేశాడు. సోమవారం పరవాడ పోలీసులు అందించిన వివరాలు ప్రకారం... ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలుపల్లి బంగార్రాజు అదే గ్రామానికి చెందిన ఎర్రయ్య అనే వ్యక్తికి రెండు సంవత్సరాల క్రితం రూ.63 వేలు అప్పు ఇచ్చి ఉన్నారు. గతంలో ఎర్రయ్య రూ.45 వేలు అప్పును చెల్లించాడు. మిగతా రూ.18 వేలు ఇవ్వాలని బంగారురాజు ఎర్రయ్యను అడిగారు. దీంతో ఎర్రయ్య అప్పు తీసుకున్నానని అందరికీ చెబుతావా అంటూ తనతో పాటు మరో ఆరుగురిని తీసుకొని బంగార్రాజు ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. ఈ క్రమంలో ఎర్రయ్య మేనల్లుడు కామరాజు కత్తితో మైలపల్లి బంగారు రాజును అతి కిరాతనంగా నరికి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పరవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. హత్య చేసిన కామరాజుతో పాటు ఎర్రయ్య, కరివి ముత్యాలు, మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగార్రాజు మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అందజేశారు.

నిందితుడిని ఉరితీయాలని ఆందోళన

బంగార్రాజు హత్య చేసిన వ్యక్తిని ఉరి తీయాలని కోరుతూ మృతుని భార్య, పిల్లలు, వారి కుటుంబ సభ్యులు పరవాడ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించారు.

గొర్రెల కాపరి హత్య
నిందితుల కోసం పోలీసుల గాలింపు

ప్రక్కుర్తి అప్పల నాయుడు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన ప్రక్కుర్తి అప్పలనాయుడు (65)ను ఆయన బావమరిది ఒమ్మి నూకరాజు, ఆయన కుమారుడు ఒమ్మి శ్రీను ఆదివారం రాత్రి హతమార్చారు. సోమవారం కశింకోట పోలీసులు అందించిన వివరాలు ప్రకారం... ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారులైన ప్రక్కుర్తి అప్పలనాయుడు (65) కుమారుడు రాజుకు, అప్పలనాయుడు బావమరిది ఒమ్మి నూకరాజు, ఆయన కుమారుడు శ్రీనుకు మధ్య ఆదివారం మధ్యాహ్నం గొర్రెలు మంద వద్ద వివాదం చోటుచేసుకుంది. ఇంటికి వచ్చిన తరువాత రాత్రి 9.30 గంటల సమయంలో మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో ఒమ్మి నూకరాజు, ఆయన కుమారుడు శ్రీను కలిసి అప్పలనాయుడును కింద పడేసి కర్రలతోనూ, కాళ్లతో పొట్టపై తొక్కరు. దీంతో అప్పలనాయుడు కడుపు పొంగిపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్‌టిఆర్ హాస్పిటల్ తరలించారు. అయితే అప్పటికే అప్పలనాయుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు రాజు కశింకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయడం జరుగుతుందని సీఐ స్వామినాయుడు తెలిపారు.

వైసిపి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

మినీ మహానాడులో ఎమ్మెల్యే రాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త తిప్పికొట్టాలని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో నియోజకవర్గ మినీ మహానాడు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కామ్‌లో ఎంతమంది వైసీపీ నేతలు జైలు కెళ్తారో తెలియదన్నారు. గత ప్రభుత్వ పాలనలో నియోజకవర్గం అవినీతిమయమైందని తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా పాలన సాగించాలన్నారు. ఈనెల 22వ తేదీన అడ్డురోడ్డులో జరుగు జిల్లా మహానాడుకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకులు మూర్తి యాదవ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంన్నారు.

తీర్మానాలు : నర్సీపట్నం బియన్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, చోడవరం సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి డిక్షనరీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నీరు నియోజకవర్గ నాలుగు మండలాలకు అందించాలని, గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టులకు బిల్లులు వేగంగా చెల్లించాలని, నియోజకవర్గ నాలుగు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తదితర తీర్మానాలను మినీ మహానాడులో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండలాల పార్టీ అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్, కోకవాడ కోటేశ్వరరావు, గుమ్ములూరు చంద్రమౌళి, రాజన్న కొండబాబు, నాయకులు కోటేశ్వరరావు, జి వెంకట సత్యనారాయణ, మజ్జి గౌరీ శంకర్, ఎంవివి సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, దేవరపల్లి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యలమంచిలిలో మినీ మహానాడు

యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గం టిడిపి మినీ మహానాడు మంగళవారం గురప్ప కల్యాణమండపంలో జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు తిరంగా ర్యాలీ ఉంటుందని, అనంతరం 10 గంటలకు మినీ మహానాడు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చేపట్టని ఉపాధి హామీ పనులు

- ఇబ్బంది పడుతున్న లంకవానిపాలెం కూలీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని లంకవానిపాలెంలో గత ఆరు నెలల పైబడిన కాలం నుండి ఉపాధి హామీ పనులు చేపట్టలేదు. దీంతో కూలీ పనుల్లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ చట్టం వచ్చిన తరువాత జనవరి నెల నుండి పనులు జరుగుతుండడంతో కూలీలకు పనులు లేని పరిస్థితి ఎప్పుడూ ఉండేది కాదు. కాని ఈ ఏడాది ఉపాధి హామీ పనులు చేపట్టకపోవడంతో గ్రామంలో కూలీలకు పనుల్లేకుండా పోయాయి. మరోవైపు గ్రామంలోని కొండ బంధ చెరువు, మెట్ట చెరువు, భావన చెరువు, యాళ్ల మెట్టతో పాటు పరిసర ప్రాంతాలు పూడికతో నిండిపోయి నీరు ప్రవహించని దుస్థితి నెలకొంది. ఆయకట్టు భూముల్లోని ప్రధాన కాలువలు కూడా తుప్పలు పొదలు బాగా పెరిగి నీరు ప్రవహించలేని దుస్థితిలో ఉన్నాయి. ఏవో కారణాలతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలుపుదల చేయడంతో తమకు పనులు లేకుండా పోయాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎపిఎం ఎస్.అప్పలరాజు వివరణ

గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెనుగంటి శ్రీనుపై రాజకీయ విభేదాలు కారణంగా కొందరు ఫిర్యాదు చేశారని ఎన్ఆర్ఇజిఎస్ ఎంపిఎం ఎస్.అప్పలరాజు ప్రజాశక్తికి తెలిపారు. ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించినప్పటికీ వారు ఏకాభిప్రాయానికి రాలేదని పేర్కొన్నారు. గ్రామంలోని ఉపాధి హామీ కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వేరొక ఇంచార్జ్ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా త్వరలో పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అప్పలరాజు తెలిపారు.

వైస్ ఎంపిపిగా సింహాచలం నాయుడు ఎన్నిక

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి వైస్‌ఎంపిపి-1గా మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచాడ సింహాచలం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరాపల్లి వైస్ ఎంపిపి-1 ఎన్నిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి ఎస్ మంజులవాణి సమక్షంలో సోమవారం జరిగింది. మండలంలో 17 మంది ఎంపీటీసీలు ఉండగా, వారిలో వైఎస్ఆర్సిపి ఎంపీటీసీలు 12 మంది హాజరయ్యారు. టిడిపి నుండి ఎవరూ పోటీ పడకపోవడంతో వైస్ ఎంపీపీ-1గా సింహాచలం నాయుడు ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి మంజులవాణి ధ్రువీకరించారు. అనంతరం ఎంపిడిఒ ఎంవి.సువర్ణరాజు, పరిపాలనాధికారి లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సింహాచలం నాయుడును వైసిపి ఎంపీటీసీలు, సర్పంచులు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పిటిసి కర్రి సత్యం, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ-2 ఉగ్రోకల గంగాభవాని, సర్పంచులు చింతల సత్య వెంకట రమణ, కర్రి సూరి నాయుడు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డొంకాడ దళిత యువకుల పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్, కేవీపీఎస్ విశాఖ జిల్లా కార్యదర్శి చిరంజీవి, దళిత నాయకులు డిమాండ్ చేశారు. బాధితుడు దళిత యువకుడు ఏ స్వర్ణ రాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... తనతోపాటు దయాసాగర్, గుమ్మడి పోతురాజు, ఈది కిషోర్ కలిసి గొడిచర్ల కొత్తూరు గ్రామానికి టెంట్ హౌస్ లైటింగ్ యజమాని వద్ద గత ఆరు సంవత్సరాల నుండి పనిచేస్తున్నామన్నారు. వివాహ, శుభ కార్యక్రమాలకు టెంట్ అండ్ లైటింగ్ ఏర్పాటు పనులను తమ నలుగురం కలిసి పని చేస్తూ ఉంటామన్నారు. డొంకాడ గ్రామంలో ఈనెల 15వ తేదీన అగ్రకులానికి చెందిన జి లచ్చబాబు వివాహం జరిగిందని, ఆ వివాహానికి మైక్ అండ్ లైటింగ్, కళ్యాణ మండపం తాము ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం కళ్యాణ మండపం, లైటింగ్ తొలగిస్తుండగా, పెండ్లి కుమారుడు లచ్చబాబు వచ్చి తన సెల్ ఫోన్ పోయిందని, తన ఫోను తీశామని తమపై నింద వేస్తూ, కులం పేరుతో దూషిస్తూ, తన కుటుంబ సభ్యులతో కలిసి కర్రతో తమపై దాడి చేసి, ఫోన్ ఇస్తారా ఇవ్వరా అని ఈడ్చుకుంటూ గ్రామంలో ఉన్న వినాయకుని గుడి వద్దకు లాక్కుని వెళ్ళారన్నారు.విషయం తెలుసుకున్న ఎస్సీ కాలనీకి చెందిన పలువురు యువకులు, మహిళలు సంఘటన ప్రాంతానికి వచ్చారని, అగ్రకులానికి చెందిన పెద్దలు కనీసం తగువును విడదీయకుండా, అక్కడకు వచ్చిన దళిత యువకులు సీకాల సందీప్, ఈది ప్రేమ్ కుమార్, కాళ్ల మధు, ఈది విజయ్ కుమార్ లపై కూడా దాడి చేశారని తెలిపారు.దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం శిక్షించాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం డొంకాడ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ పెద్దలు, దళిత సంఘాల నాయకులు, నాసా సంస్థ ప్రతినిధులు పోలీస్ స్టేషన్ కు చేరుకుని బాధితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు, దళితులు

పెద్దలు కూరపాటి అప్పారావు,వీధి కన్నారావు, నొప్పి అప్పారావు, వీధి సత్యనారాయణ,కుంచే రమణ, నొక్కు శివ, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడు అయినవిల్లి స్వర్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. ఈ కేసు కు సంబంధించి డిఎస్ పి విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో ఎండపల్లి, తంగేడు, సుంకపూరు, రాట్నాల పాలెం, కోటవురట్ల గ్రామాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై సోమవారం జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాద్ అవగాహన కల్పించారు. ఫోరోసిస్‌లో ఎముకలు మెత్తబడడం, దొడ్డికాళ్ల వంటి లక్షణాలు ప్రధానంగా ఉంటాయన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడంతో పాటు ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో నీటి నమూనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గోవిందరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న విశ్వనాథ్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం టి అర్జాపురం శివారు గదప పాలెం గ్రామ సమీపంలో మోదమాంబ అమ్మ దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. టి.అర్జా పురం సర్పంచ్ మడగల అర్జున (పాల్గొణ) కుటుంబం ప్రతి ఏటా మే నెలలో ఈ అమ్మ జాతరను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మూడవ రోజు మంగళవారం స్థానిక ఆలయం వద్ద జిల్లా స్థాయి ఎడ్ల బండి పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ అర్జున తెలిపారు.ఎడ్ల బళ్ళు పోటీ లలో పాల్గొనే వారికీ ప్రథమ బహుమతి రూ. 10 వేలు,రెండవ బహుమతి రూ 8 వేలు,మూడవ రూ 6 వేలు నాలుగవ రూ 4 వేలు, ఐదవ రూ 2 వేలు అందజేస్తున్నట్టు వివరించారు.

యోగా చేస్తున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నిత్యం యోగా చేయడం అలవర్చుకోవాలన్నారు. యోగా చేయడంతో కలుగు ఉపయోగాలను తెలియజేశారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగాతో మానశిక, శారీరక ఆరోగ్యం కలుగుతాయని ఆయన తెలియజేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు స్పందన

నర్సీపట్నంలో హాజరైన చిన్నారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలకు మంచి స్పందన లభించింది. వేసవి శిబిరాల్లో భాగంగా కథలు, ఆటలు, పాటలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోటవరట్ల ప్రభుత్వ ఉపాధ్యాయులు బి ఎస్ ఎస్ ప్రసాద్ నీతి కథలపై వివరించారు.చెస్ ఆటలో తన కుమార్తె ప్రత్యూష గ్రాండ్ మాస్టర్ హొదాను ఏవిధంగా సాధించిందో వివరించారు. కృషి, పట్టుదల వున్నప్పుడు మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థులు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు.

నైపుణ్యాల పెంపుదలపై దృష్టి

ప్రజాశక్తి -ములగాడ : విద్యార్థి దశ నుంచే వివిధ రకాల నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి సూచించారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భావ ప్రకటన, వృత్తి విద్య, యాజమాన్య, నాయకత్వ నైపుణ్యాలను బాలలు అభ్యసించాలని కోరారు. నైపుణ్యాల వల్ల వ్యక్తిత్వం వికసిస్తుందని, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం వ్యర్థ పదార్థాలతో కళాకృతులను తయారుచేయడంలో శిక్షణ ఇచ్చారు. జాతీయ సేవా పథకం వాలంటీర్ సునీత ఆంగ్ల వ్యాకరణంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కొత్తకోటలో సౌకర్యాలు కల్పించేందుకు కృషి

ప్రజాశక్తి -కొత్తకోట: మేజర్ పంచాయతీ కొత్తకోట గ్రామంలో ప్రజలకు అత్యవసరమైన మరిన్ని మౌలిక వసతులను కల్పిచెందుకు తన వంతు కృషి చేస్తానని చోడవరం జన సేన ఇన్‌ఛార్జ్ పివిఎస్ఎన్ రాజు అన్నారు. సోమవారం సాయంత్రం కొత్తకోటలో ప్రకాష్ నగర్ కాలనీతో పాటు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించించారు. అక్కడ సమస్య లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో సమస్య లను గుర్తించి ఎమ్మెల్యే, ఎంపిలకు తెలియపరుస్తానని, అప్పటికీ నేరవేరకుంటే నేరుగా ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి లో పెడతానని పేర్కొన్నా రు. కాలనీలో రెండు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు సరిగా పనిచేయకపోవడంతో నిత్యం విద్యుత్ సమస్య ఉంటుందని పలువురు మహిళలు రాజు కు వివరించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పార్టీ నాయకులు చింతల కిషోర్, లోట్ల శివ, కోన రమణ, పాసపు నగేష్ , కార్యకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో..

ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి

ప్రజాశక్తి- అరకులోయ: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేయాలని, మెగా డిఎస్సీలో ఆదివాసీ ప్రాంతంలో నోటిపై చేసిన 4680 ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలని ఏజెన్సీ డిఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేశారు.అరకులోయలో ఏజెన్సీ డిఎస్సీ సాధన కమిటీ జిల్లా కోకన్వీనర్ పొద్దు బాలదేవ్ గిరిజన సంఘం భవనం లో జిల్లా మండల కోకన్వీనర్లు చట్టు మోహన్, నన్ని జాన్ బాబు,పాంగి అశోక్, కిల్లో జగనాధం, పాంగి నానిబాబు తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ,ఏజెన్సీ డిఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19 న రైల్ రోకో పిలుపు ఇవ్వడంతో ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి,సబ్ కలెక్టర్ లతో చర్చలు జరిపిందని, జిల్లా కలెక్టర్ ద్వారా నివేదిక కోరిందని ఏజెన్సీ డిఎస్సీ సాధన కమిటీ విన్నతి పత్రం ఆధారంగా నివేదిక ఇచ్చారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 20న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మెగా డిఎస్సీ నుండి షెడ్యూల్ ఏరియా ఆదివాసీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి స్పెషల్ డిఎస్సీ ద్వారా భర్తీ చేసే విధంగా ఆదివాసులకు అనుకూలంగా తీర్మానం చేయాలన్నారు.100 శాతం రిజర్వేషన్ మాత్రమే ఆదివాసీ సమాజం కోరుకుంటుందని, ఆదివాసులకు హామీ ఇచ్చి కాలయాపన లేకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఆదివాసీలు పోరాటానికి సన్నద్ధం చేస్తామని హెచ్చరించారు.

బహుమతులతో విజేత జట్టు

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో గ్రాండ్ బాయ్స్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్ లో ఐపీఎల్ ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. .ఈ ఆటల పోటీలకు 9 టీములు పోటీపడ్డాయి.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఫైర్ స్క్వాడ్ మొదటి బహుమతి 15000 వేలు రావికమతం సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, గొంప ఎంపీటీసీ సూర్యనారాయణ ఆర్థిక సహాయంగా అందజేశారు. గోల్డెన్ స్ట్రైకర్స్‌కు రెండవ బహుమతిగా డాక్టర్ బుజ్జి, గెంజి శ్రీను ల్యాబ్ టెక్నీషియన్ పదివేలు అందజేశారు. హంగ్రీ చేతస్‌కు 3వ బహుమతి 6000 గెంజి నాగేశ్వరరావు (టీచరు) అనపర్తి రవి డిసిసిఎల్ మెంబరు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఫైనల్ మ్యాచ్లో ప్రథమ స్థానం సాధించిన విజేతకు గెంజి శ్రీనివాసరావు జనసేన నాయకులు 2000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ ఆటల పోటీలకు ఆర్థిక సహాయాన్ని అందించిన పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులగాయల గోవిందు, సత్యనారాయణ, గ్రాండ్ బాయ్స్ పలువురు పాల్గొన్నారు.

బైకుపై దొంగ నోట్ల బ్యాగు

-పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ కొత్త వీధిలో ఉంటూ కొత్తకోటలో ప్రభుత్వ టీచరుగా పనిచేస్తున్న సాంబశివ సోమవారం దొంగ నోట్లతో ఉన్న సంచిని గుర్తించి నర్సీపట్నం పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. సోమవారం ఉదయం టీచర్ సాంబశివ తన భార్యను ఊరు పంపించడం కోసం బైక్ పై నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ కు తీసుకువచ్చారు. బస్సు ఎక్కించి తిరిగి వెళ్ళే సమయానికి బైక్ పై ఒక సంచి ఉంది. తెరిచి చూడగా అందులో పాత జీన్ ప్యాంటు, ఒక షర్ట్ తో పాటు 500 రూపాయలు నోట్ల కట్టలు ఉన్నాయని సాంబశివరావు తెలియజేశారు. 100కు ఫోన్ లో ఫిర్యాదు చేయడంతో వారు ఇచ్చిన సూచన మేరకు నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ లో నోట్ల కట్టలతో ఉన్న సంచిని అప్పగించారు.

దొంగ నోట్లు

సుందరయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడు

- పలుచోట్ల వర్ధంతి సభలు

అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న లోకనాథం, తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సిపిఎం ప్రథమ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సభ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగింది. సుందరయ్య చిత్రపటానికి లోకనాథం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్షనేతగా మన్ననలను చూరగొన్నారన్నారు. ప్రజా సేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగజీవి అని కొనియాడారు. నేడు దేశంలో విలువలతో కూడిన రాజకీయాలకు తిలోదకాలిస్తున్న తరుణంలో సుందరయ్య వంటి మహానేత నిరాడంబరతను, త్యాగనీతిని అలవర్చు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపైనా, మతోన్మాదానికి వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలను విస్తృతంగా నిర్వహించడమే సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్. శంకర్రావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కాళ్ళ తేలయ్యబాబు, తులసీరామ్, రమేష్, బి.నూక అప్పారావు, చలపతిపాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య 15వ ఏటనే అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. ఆయన పోరాట పటిమను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, ఆడారి రామలక్ష్మి, మల్ల సత్యనారాయణ, ప్రసాదు, దొడ్డి తేజ ,ఆళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కార్యాలయంలో...

పరవాడ : సిపిఎం ఆధ్వర్యాన పరవాడ ఊర చెరువులో ఉపాధి హామీ కార్మికుల సమక్షంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ కష్టజీవుల కోసం తన జీవితాన్నే ప్రజలకు అంకితం చేసిన కమ్యూనిస్టు గాంధీగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గనిశెట్టి సత్యనారాయణ, రమణమ్మ, పార్వతి, లక్ష్మి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం, వెంకన్నపాలెం, గాంధీ గ్రామం తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు వివి.శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు, వెంకట్రావు, శేఖర్, జోగా రాము, శ్రీను, నూకరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

కొత్తకోటలో...

కె.కోటపాడు : మండలంలోని సూరెడ్డిపాలెం, కె.సంతపాలెం గ్రామాలలో సుందరయ్య చిత్రపటాలకి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయనబాబు, ఈ.నాయుడు బాబు, ఎర్ర దేముడు, రొంగలి ముత్యాల నాయుడు, గాడి ప్రసాదు. గాడి లక్ష్మి, నాగరాజు, సింహాద్రి, జామి శ్రీరామ్మూర్తి, ఈర్లే దేవుడునాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలో ఉపాధి హామీ శ్రామికుల సమక్షంలో సుందరయ్య చిత్ర పటానికి సిఐటియు మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సుందరయ్య ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

సబ్బవరం : స్థానిక శ్రీ దుర్గామాంబ ముఠా కళాసి కార్యాలయంలో సుందరయ్య చిత్ర పటానికి సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి పూలమాల వేశారు. కార్యక్రమంలో కళాసీ సంఘం నాయకులు బర్ల రమణ, బంగారు నాయుడు, అప్పారావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కోడాపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నేత సిహెచ్ లక్ష్మణ జెండా ఎగురవేశారు. అనంతరం చిత్రం పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు

నక్కపల్లిలో...

డి.వెంకన్న, తామార్ల శంకరరావు చేదల ఎరకన్నదొర, మామిడి దేముడు, సిహెచ్ దేముడు, సోముల బిమ్మాలమ్మ, సిహెచ్ చినదేముడు, కాశి పైడితల్లి, పి దేముడు, కె పెంటయ్య, పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యమ్రంలో సిపిఎం నాయకులు జి.దేవుడునాయుడు, ధోని కాసియా, వై రాము, కె నూకరత్నం, జి లక్ష్మి, సిహెచ్ పవన్ కుమార్, సిహెచ్ గంగరాజు, అప్పారావు, చిన్న కలవలపల్లి గ్రామ సర్పంచ్ వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.రాము, కూండ్రపు సోము నాయుడు, చౌడపల్లి అప్పారావు, బొడ్డేడ రామకుమార్ నాయుడు, తట్టా రాజు పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సిఐటియు నాయకులు చింతకాయల శివాజీ, ఎం.రమణ, పి.జానకి, కూర్మారావు, నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు, కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి ఈ. చిరంజీవి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, కన్నారావు, ఐనవెల్లి లోవరాజు, నొక్కి సత్తిబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: బోడ్డేపల్లి మార్కెట్ యార్డు లో సిపిఎం నాయకలు కె. త్రిమూర్తులురెడ్డి, సాపిరెడ్డి నారాయణమూర్తి, లగుడు గౌరి, కె.వి.సూర్యప్రభలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, టి. ఈశ్వరరావు, రామకృష్ణ, కృష్ణ, రాము పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండల చీమల పాడు శివారు అజయ్‌పురంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాంగి చంద్రయ్య, కెవిపిఎస్ నాయకులు చెవిటి సూరిబాబు పాల్గొన్నారు...

ములగాడ : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించారు. జివిఎంసి 59వ వార్డు పరిధి నెహ్రూనగర్, 58, 59, 60 వార్డులోనూ, 63వ వార్డు పరిధి క్రాంతినగర్ వర్ధంతి సభలు నిర్వహించారు. క్రాంతినగర్‌లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, పేద ప్రజలు, కార్మిక వర్గం కోసం సుందరయ్య తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ధనిక భూస్వామి ఇంట పుట్టిన

పరవాడలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

సుందరయ్య తన భూమిని పేదలకు పంచి పెట్టారని తెలిపారు. పిల్లలు పుడితే స్వార్థం పెరుగుతుందని ఆపరేషన్ చేసుకున్న ఆదర్శ మూర్తులని కొనియాడారు. భారత పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సభకు సైకిల్‌పైనే వెళ్లేవారని తెలిపారు. నేటి మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బిజెపి విధానాలను తిప్పి కొట్టాలంటే సుందరయ్య వేసిన బాటలో మనమంతా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

ముఠా కార్మికులు జరిపిన వర్ధంతి సభలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు పాల్గొని పూలమాలవేసి నివాళులర్పించారు. 59వ వార్డు నెహ్రూ నగర్‌లో సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, జివిఎంసి ఆఫీసు వద్ద శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సునీల్. నాయకులు కె.రమణ సుందరయ్య చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు బూడి శ్రీను, ఎస్.వాసు, జి నరేష్, ఏసుబాబు, తాత బుజ్జి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : పిఎం.పాలెం 2వ బస్‌స్టాప్ వద్ద సుందరయ్య చిత్రపటానికి సిఐటియు నాయకులు బి.అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ

నర్సీపట్నంలో...

కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, సిహెచ్.శేషుబాబు, డి.సూరిబాబు, కె.అర్జునమ్మ, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కులో

బింద్రానగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో సుందరయ్య చిత్ర పటానికి శేషగిరిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డిపల్లి బాబూరావు, పి.రాజుకుమార్, వి.రామసుబ్బయ్య, సిహెచ్.గాంధీ, డి.త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక వై.జంక్షన్, బాలాజీనగర్,

మల్కాపురం క్రాంతినగర్‌లో నివాళి అర్పిస్తున్న జగ్గునాయుడు

యాతపేట, ప్రయివేటు మార్కెట్ వద్ద జరిగిన వర్ధంతి సభల్లో సుందరయ్య చిత్రపటాలకు సిపిఎం, సిఐటియు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం, సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, పంపాన సూర్యనారాయణ, నీలాతి రాము, పి.పెంటరాజు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ, బిఎన్ఆర్.నగర్‌లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు వి.నరేంద్రకుమార్, సిహెచ్.నాయుడు, నాగరాజు, రమణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి జ్యోతినగర్‌లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు బి.అనంతలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు బి.రమణి, శంకరరావు, మాధవరావు, గంగమ్మ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : కంచరపాలెంలోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య బాటలో అందరూ నడవాలని, సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, ఒ.అప్పారావు, బి.సింహాచలం, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి దశమికొండలో సిపిఎం ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లెల నర్సింగరావు, ఎ.నూకేశ్వరరావు, గొలగాని అప్పారావు, లోవరాజు, సిహెచ్.దాలినాయుడు పాల్గొన్నారు.

జివిఎంసి 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎ.లోకేశ్వరరావు, జై.కోటేశ్వరరావు, శ్రీలక్ష్మి, అప్పలరాజు, ఎం.సుబ్బన్న పాల్గొన్నారు. స్వతంత్రనగర్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఎం.శ్రీదేవి, లక్ష్మి, రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఆఫీసులో...

ఆటోనగర్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ పేదల అభివృద్ధి కోసం పాడుపడ్డారన్నారు. తన ఆస్తిని పంచిపెట్టిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పందిమెట్ట జంక్షన్‌లో కె.నరసింగరావు అధ్యక్షతన జరిగిన సుందరయ్య వర్ధంతి సభలో ఐద్వా జగదాంబ జోన్ నాయకురాలు పి.మణి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

కంచరపాలెంలో...